సమీక్షా సమావేశంలో మత పెద్దలు, జిల్లా అధికారులతో మాట్లాడుతున్న ప్రతిమాసింగ్

ఇబ్బందులు కలుగొద్దు

◆ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

◆ వివిధ శాఖల జిల్లా అధికారులు, మత పెద్దలతో ప్రత్యేక సమావేశం

ఆదిబట్ల, ఫిబ్రవరి 27 : రంజాన్ మాసంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రంజాన్‌పై వివిధ శాఖల జిల్లా అధికారులు, మత పెద్దలతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం రంగారెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా విద్యుత్, నీరు, పారిశుధ్యం, భద్రత, ఆరోగ్యం గురించి ఎటువంటి ఫిర్యాదులు అందకూడదని.. దీని కోసం ప్రతి విభాగం చురుగ్గా, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇఫ్తార్, సెహ్రీ సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. మసీదులు, ఈద్గాలు, ఇతర ప్రదేశాల చుట్టూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రోడ్లపై సరైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. శాంతిభద్రతలను నిశితంగా పరిశీలించాలని పోలీస్ అధికారులను కోరారు. మార్కెట్లు, మసీదుల వద్ద ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి మత పెద్దలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

మధ్యాహ్నం 2.30కే తాళం వేసి ఉన్న కోట్‌పల్లి దవాఖాన

మధ్యాహ్నానికే దవాఖానకు తాళం..!

బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 27 : కోట్‌పల్లిలోని ప్రభుత్వ దవాఖానలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన సిబ్బంది మధ్యాహ్నం 2.30కే తాళం వేసి వెళ్లిపోయారు. ఈ దవాఖానలో ఉండాల్సినంత సిబ్బంది లేరని ప్రజలు పేర్కొంటున్నారు. మెడికల్ ఆఫీసర్ ఒకరు ఉండగా, ఒక స్టాఫ్ నర్స్ ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ డెప్యూటేషన్‌లో వెళ్లగా, సీహెచ్‌వో సెలవుపై ఉన్నట్లు తెలిసింది. గురువారం మధ్యాహ్నానికే తాళం వేయడంతో దవాఖానకు వచ్చిన రోగులు ఇదేమి తీరు, ఇదేం ప్రభుత్వమంటూ అసహనం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

మార్చి 3 నుంచి 5 వరకు దివ్యాంగుల అంచనా శిబిరాలు

అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఉమాహారతి

వికారాబాద్, ఫిబ్రవరి 27 : జిల్లాలో మార్చి 3 నుంచి 5 వరకు దివ్యాంగుల అంచనా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఉమాహారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని ధర్మ విద్యాలయంలో శిబిరం ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. భారత ప్రభుత్వ ఏడీఐపీ పథకం కింద గుర్తించబడిన, అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉపకరణాలను అందించడం జరుగుతుందన్నారు. బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రొపైల్డ్ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ వంటి సహాయక పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు శిబిరానికి హాజరు కావాలన్నారు. అన్ని సహాయక ఉపకరణాలు పొందుటకు కనీసం 40 శాతం వైకల్యం తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. లబ్ధిదారుడు, వారి సంరక్షకుల అన్ని వనరుల నుంచి నెలవారీ ఆదాయం రూ.22,500 లేదా అంతకంటే తక్కువ ఉన్నట్లు చూపించే ఆదాయ రుజువు కాపీ కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ అధికారి, ఎమ్మెల్యే, ఎంపీచే ధ్రువీకరణ, బీపీఎల్ రేషన్ కార్డు, దివ్యాంగ పెన్షన్ రుజువు సమర్పించాలన్నారు. ఆధార్ కార్డు కాపీ, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు కలిగి ఉండాలని సూచించారు. సమాచార నిమిత్తం 8179432874ను సంప్రదించాలన్నారు. ఇది సదరం క్యాంపు కాదని.. ఇక్కడ ఎటువంటి సర్టిఫికెట్స్ ఇవ్వబడవన్నారు. సర్టిఫికెట్స్ ఉన్నవారికి ఉచితంగా సహాయక పరికరాలు అందించడానికి రిజిస్ట్రేషన్ చేసే క్యాంపుగా గుర్తించాలని ఆమె పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయాన్ని సాగు చేసుకుందాం

ఉద్యానవనశాఖ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రాజారెడ్డి

రైతులతో మాట్లాడుతున్న రాజారెడ్డి

షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 27 : శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయాన్ని సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని ఉద్యానవన శాఖ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో విశ్రాంత ఉద్యోగులు ఏర్పాటు చేసిన శ్రీఫౌండేషన్‌ను గురువారం వైస్ ఛాన్స్‌లర్ ప్రారంభించి మాట్లాడారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, దేశానికి వెన్నెముక రైతన్న ఆర్థిక ప్రగతి సాధించేందుకు అందరం కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాల్లో వ్యవసాయం సాగవుతున్నదని, అందులో 12.5 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయన్నారు. తెలంగాణలోని రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు రావడంలేదన్నారు. పంటల సాగు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులను అంచనా వేస్తూ పంటలు సాగు చేస్తే లాభాలు అర్జిస్తారన్నారు. నీటి వనరు, సారవంతమైన భూమిని కలిగి ఉన్న మనం రాజస్థాన్ నుంచి కూరగాయలను మన ప్రాంతానికి దిగుమతి చేసుకోవడం దురదృష్టకరమన్నారు. శ్రీఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్య, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, మహిళా శక్తి చైతన్యం, ఉద్యానవనం, యువత స్వయం ఉపాధి, కళాకారుల ప్రోత్సాహం, ఆర్థిక ప్రగతి, బ్యాంకింగ్ సేవలు, దివ్యాంగుల సేవ, అర్బన్ హార్టికల్చర్ తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ రవికుమార్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి మహేశ్వరి, సభ్యులు, విశ్రాంత టీఎన్జీవోలు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 27 : ప్రభుత్వ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, డీఈవోలు, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు గుర్తించి రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు టీటీ వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. అదేవిధంగా పుట్టిన నవజాత శిశువు నుంచి రెండు సంవత్సరాల పిల్లలందరికీ వ్యాక్సిన్లను తప్పకుండా వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు చేయాలని, బీపీ, షుగర్ ఉన్నవారికి ప్రతి నెల మందులను అందజేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా జాగ్రత్తలను పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అమృతజోసెఫ్, హరికిషన్, స్రవంతి, రాఘవేందర్, నికిత, కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు, డీఈవోలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

ఆమనగల్లు/కొందుర్గు, ఫిబ్రవరి 27 : ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పరిశీలనకు వెళ్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఆమనగల్లులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును కొందుర్గు మండలానికి చెందిన యువ నేత, బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలవడం ఆనందంగా ఉందని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రాల సందర్శన

జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించనున్న పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ బృందం



రీసెర్చ్ సెంటర్ బృందానికి వివరాలను వెల్లడిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

వికారాబాద్/పరిగి/దోమ, ఫిబ్రవరి 27 : భారత ప్రభుత్వ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ న్యూఢిల్లీవారి ఆధ్వర్యంలో పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్, డాక్టర్ సురేశ్‌కుమార్ బృందం మూడు రోజులపాటు వికారాబాద్ జిల్లాలో పర్యటిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం ఈ బృందం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులతో కలిసి వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పూడూరు మండలం చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మన్నెగూడ ఆరోగ్య ఉపకేంద్రం, పరిగిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొంపల్లి సబ్‌సెంటర్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన అసంక్రమిత వ్యాధులు, ట్యూబర్కులోసిస్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, చికిత్స, తదనంతర ఫాలోఅప్ సేవలు, అవసరమైన వారికి రిఫరల్ సేవలు, మాతాశిశు సంరక్షణ సేవలు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలుపై సలహాలు, సూచనలు చేశారు.

గర్భవతులు, బాలింతలకు సరైన సమయంలో నమోదు, అవసరమైన సేవలు, ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడడం, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర, ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భవతుల్లో సిజేరియన్ ప్రసవాలు జరిగేలా చూడడం, స్కానింగ్ సౌకర్యం వంటి వివిధ సౌకర్యాల గురించి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో సేవలు అందించడంలో, ఆరోగ్య కేంద్రాల్లో వసతులు కల్పించడంలో సలహాలందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల ఆవరణలతో పాటు రికార్డులు, డెలివరీ, ఫార్మసీ, ల్యాబ్ రూమ్‌లను పరిశీలించారు. మరో రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించి భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా.జీవరాజ్, డా.రవీంద్ర యాదవ్, ప్రోగ్రాం అధికారులు డా.పవిత్ర, డా.బుచ్చిబాబు, డాక్టర్ నిరోషా, డాక్టర్ బీబీ జానీ, డా.ప్రవీణ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, దోమ పీహెచ్‌సీ డా.రజిత, మెడికల్ ఆఫీసర్ షేక్ అఖిల్, హెచ్‌ఈవో ప్రభులింగం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్చిచ్చును ఆర్పేద్దాం.. అడవిని రక్షిద్దాం..

- వేసవిలో అడవుల సంరక్షణపై ప్రత్యేక ప్రణాళిక
- అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 : అడవిలో కార్చిచ్చు వ్యాపించేందుకు అనేక కారణాలను చెప్పుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఉన్న అటవీ సంపదను కాపాడుకునేందుకు ప్రతిఏటా వేసవికి ముందుగానే అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ప్రతి వేసవిలో అడవికి కార్చిచ్చు ప్రమాదం పొంచి ఉంటున్నది. అడవిలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకునేందుకు ప్రథమ కారణం మనుషులే.. అటవీ ప్రాంతాన్ని సందర్శించిన సమయంలో బీడీలు, సిగరెట్లు తాగి కింద పడేస్తుంటారు. ఇది రాజుకుని చిన్న మంటగా మొదలై కార్చిచ్చుగా వ్యాపిస్తుంది. కొంతమంది అడవిలో సంచరిస్తూ వంటలు చేసుకుని నిప్పును పూర్తిగా ఆర్పివేయకుండానే వెళ్లిపోతుంటారు. ఈ విధంగా కూడా నిప్పు వ్యాపిస్తుంది. వేసవికాలం కావడంతో మంటలు సులువుగా చెలరేగుతుంటాయి. అలాగే, వేసవిలో చెట్ల ఆకులు ఎండి రాలిపోతుంటాయి. అటవీ ప్రాంతంలో కింద మొత్తం ఎండిపోయిన ఆకులు ఉండటం, పెద్దపెద్ద గుట్టలున్న చోట గుట్టలపై నుంచి రాళ్లు జారిపడుతూ.. అవి రాసుకోవడం వల్ల నిప్పు రవ్వలు ఎగిసి ఎండుటాకులపై పడటంతో మంటలు వ్యాపిస్తుంటాయి. అటవీ ప్రాంతం సమీపంలో పొలాలు ఉన్న రైతులు చెత్తను తగులబెట్టిన సమయంలో కూడా నిప్పు రవ్వలు అడవిలో పడి అగ్ని రాజుకుంటుంది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న అటవీ సంపదను కాపాడుకునేందుకు ఫారెస్టు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మంటలతో అటవీ సంపద పాడవకుండా ఉండేందుకు ఎక్కడ అగ్నిప్రమాదాలు జరిగినా శాటిలైట్ ద్వారా తెలుసుకుని అటవీ శాఖ బృందాలను అలర్ట్ చేస్తూ ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

అటవీ సంపదను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో రెండు అటవీ ప్రాంత డివిజన్లున్నాయి. అందులో శంషాబాద్, ఆమనగల్లు డివిజన్లు ఉండగా.. వీటిలో ఆమనగల్లు డివిజన్ పరిధిలో ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్లు రేంజ్‌లు., శంషాబాద్ డివిజన్ పరిధిలో మంఖాల్, చిలుకూరు, హయత్‌నగర్ రేంజ్‌లున్నాయి. ఈ ప్రాంతాల్లో అరుదైన చెట్లతో పాటు జంతువులు, పక్షలు సంచరిస్తుంటాయి. కార్చిచ్చు వ్యాపిస్తే మూగజీవాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మూగజీవాలు, పచ్చని చెట్లను రక్షించడం కోసం అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అడవులను రక్షించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిప్పులు రాజేయవద్దని, సిగరెట్లు, బీడీలు కాల్చి పడవేయవద్దని చెబుతున్నారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా బేస్ క్యాంప్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ వన్యప్రాణుల సంరక్షణతో పాటు అటవీ సంరక్షణ కోసం పనిచేస్తాయి. ఈ బృందాలు రాత్రి, పగలు సమయంలో అటవీ ప్రాంతాల్లోనే గస్తీ తిరుగుతూ.. అడవి, వన్యప్రాణులను కాపాడుతారు. అలాగే ట్రాక్టర్లతో పిట్స్‌లో నీటిని నింపుతున్నారు. మంటలు వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

అటవీ ప్రాంతంలో రాజుకున్న నిప్పుతో ఎగిసిపడుతున్న మంటలు

మంటలు వ్యాప్తిచెందకుండా ఫైర్ లైన్స్

వేసవిలో పెద్దఎత్తున మంటలు చెలరేగనుండడంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది అటవీ ప్రాంతాల్లో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. 5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫైర్ లైన్స్ మంటలను అదుపు చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతి అటవీ ప్రాంతంలో ఫైర్ లైన్స్‌ను బాక్సులుగా ఏర్పాటు చేస్తారు. ఒక బాక్సులో నుంచి మరో బాక్సులోకి మంటలు ప్రవేశించకుండా ఉండేందుకు ఫైర్ లైన్స్ ఎంతో మేలు చేస్తాయి.

ఆగాపల్లి అటవీ ప్రాంతంలో మంటలను అదుపు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కబ్జా చేస్తున్నా.. అడ్డుకోరా..!

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి గిరి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 27 : చెరువులు, కుంటలను కాపాడడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి గిరి పేర్కొన్నారు. గురువారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీలో చెరువులను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుపోయామన్నారు. కాని అధికారులు మాత్రం కబ్జాలను అడ్డుకోవడంలేదన్నారు. శంషాబాద్‌లోని కాముని చెరువుతో పాటు ఫిరంగినాలా, తీగల కుంటలను కబ్జా చేస్తున్నా చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. దీంతోపాటు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు

వ్యాపారస్తులకు ఫుడ్ సేఫ్టీ నోటీసులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్ ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్‌మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గురువారం నగరంలోని పలు వ్యాపార సంస్థలపై జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం తనిఖీలు నిర్వహించింది. సంతోష్‌నగర్‌లో 4 ఎం వ్యాపారులు, మెహిదీపట్నంలో కింగ్స్ రెస్టారెంట్, కేఫ్, యూసుఫ్‌గూడ ఉషోదయ సూపర్ మార్కెట్, జుమ్రత్ బజార్ వద్ద జై భవానీ, చాంద్రాయణగుట్టలో క్రీమ్ ఫిల్స్ ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్‌లపై తనిఖీలు చేపట్టగా..ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించలేదని పరిశీలనలో తేలింది. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేశామని, ల్యాబ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేసి తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 24వ తేదీలోగా తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

పరీక్షల వేళ.. ఆందోళనలేల?

సమయానికి నిద్ర.. సరైన ఆహారం అవసరం
పరీక్షలు సమీపిస్తున్న వేళ గందరగోళం
ఆందోళన వద్దంటున్న మానసిక వైద్య నిపుణులు
పది, ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పలు సూచనలు
మానసిక నిపుణురాలు డాక్టర్ నివేదిత సామలతో నమస్తే ప్రత్యేక ఇంటర్వ్యూ



విద్యార్థి పరీక్షలను ఓ కనిపించని భూతంలా చూస్తున్నాడు. టాప్‌లో ఉండే విద్యార్థి కూడా పరీక్షల నేపథ్యంలో భయపడటం వల్ల తక్కువ మార్కులకు పరిమితమవుతాడు. ఆ ధోరణి వీడండి. లోపల ఉండే భయాన్ని పక్కన పెట్టి ధైర్యంగా పరీక్షా కేంద్రంలోకి వెళ్లండి. మూడు గంటలు ప్రశాంతంగా పరీక్షలు రాయండి. ముందుగా పరీక్షా పత్రాన్ని ఒక పది నిమిషాలు ఓపికతో చదవండి. ఆ క్షణంలో మీ మెదడు వాటికి సంబంధించిన జవాబులను మీకు అందిస్తుంది. ఆ తరువాత మీకు తెలిసిన జవాబులు ముందు రాసి, రానివి ఆ తరువాత రాయండి. అన్నింటికి సమాధానాలిచ్చే ప్రయత్నం చేయండి.

టైం మేనేజ్‌మెంట్ అవసరం..

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే టైం మేనేజ్‌మెంట్ అనేది అత్యంత అవసరం. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి దాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థికి ఇప్పటివరకు నాలుగు సార్లైనా రివిజన్ చేయించడం ప్రధానం. ప్రతి సబ్జెక్టుకు టైం టేబుల్ పెట్టుకొని విద్యార్థులు వాటిని తప్పకుండా ఆచరించాలి.

మెమరీ కన్సాలిడేషన్ కావాలి..

కొందరు విద్యార్థులు రోజులో అధిక సమయం చదువుతూనే ఉంటారు. ర్యాంకులు, మార్కుల కోసం తిండి, నిద్రమాని మరీ పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. మనిషికి పగలు ఎంత ముఖ్యమో.. రాత్రి కూడా అంతే ముఖ్యం. రాత్రి వేళల్లో నిద్రించగానే మానవుడి మెదడు మెమరీ కన్సాలిడేషన్‌లోకి వెళ్తున్నది. విద్యార్థి కష్టపడి చదివినదంతా రాత్రి పడుకున్నాక జ్ఞాపకశక్తి గట్టిపడి గుర్తుండేలా చేస్తుంది. తప్పనిసరిగా రోజుకు 6 నుంచి 8 గంటలు నిద్ర అవసరం. దాంతోపాటు సరైన పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం అవసరం. అప్పుడే మెదడుకు గ్లూకోజ్ అందిపనిచేసేందుకు సిద్ధమవుతుంది.

యోగా చేయండి..

చదువుతున్నాం.. కానీ, గుర్తుండటం లేదనే సమస్యతో అనేక మంది తమలో తామే బాధపడుతుంటారు. అదంతా వారి అపోహ మాత్రమే. ఎంత చదివినా మనిషికి గుర్తుండేది 80 శాతం మాత్రమే. నిరంతరం చదవడమే కాకుండా కాసేపు మ్యూజిక్ వినడం, కాసేపు మైదానంలో ఆటలు ఆడటం, యోగా, వ్యాయామాలు చేయడంవల్ల కూడా చదివింది గుర్తుంటుంది. మానసికంగా దృఢంగా ఉంటారు. సెల్‌ఫోన్ గంటకు మించి వాడినా కూడా వ్యసనంగా మారి మిమ్మల్ని నాశనం చేస్తుంది. దాని నుంచి దూరం అయ్యేందుకు కూడా పైవాటిని అనుసరించడం ఉత్తమం.

పరీక్షల సమయంలోనే అధికం..

పరీక్షల సమయంలో సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు మానసిక సమస్యలతో బాధపడుతూ వైద్యులను సంప్రదిస్తుంటారు. సాధారణ రోజుల్లో నెలకు 150 నుంచి 180 మధ్యలో వస్తే, పరీక్షల సీజన్‌లో మాత్రం 200 మందికి పైగా వస్తుంటారు. ఇందులో ప్రధానంగా ఆరో తరగతి నుంచి పది, ఇంటర్ విద్యార్థులు అధికంగా వస్తుంటారు. గతేడాది ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు హైదరాబాద్ జిల్లాలోని 178 ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి గైడెన్స్ ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు సాధించగలిగాం.

యెర్క్స్-డోడ్సన్ సూత్రం అవగాహన అవసరం..

యెర్క్స్-డోడ్సన్ సూత్రం మానవుని నిత్య జీవితంలో ఒక భాగంగా మారాలి. ఆ సూత్రాన్ని అర్థం చేసుకుంటే ఒత్తిడిని దూరం చేయొచ్చు. ఈ సూత్రం ప్రకారం, సరైన స్థాయిలో ఒత్తిడి ఉంటే విద్యార్థి మరింత సమర్థవంతగా చదువుతాడు. ఒత్తిడి తక్కువ ఉంటే చదువుపై ఆసక్తి ఉండదు. ఒత్తిడి అధికమైతే భయం, ఆందోళన పెరిగి తన ప్రతిభ తగ్గిపోతుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై చేసే ఒత్తిడి కూడా ఈ తరహానే. అందుక